# పిచ్చిమాలోకం !

ఇద్దరూ సీనియర్ సిటిజన్లే! ఒకరు పెన్షనర్. రెండవ వ్యక్తి నాన్ పెన్షనర్! అంతే తేడా! ఇద్దరి వయసూ, రమారమి డెబ్భై దాటి వుంటాయ్.

వామనరావుకి భార్యపోయి నాలుగేళ్లయింది. మాధవరావు శ్రీమతి రోగిష్టిది. వళ్లంతా రోగాల పుట్ట! బి.పి., షుగర్, మోకాళ్ల నొప్పులు..ఉబ్బసం.. ఒక కంట్లో శుక్లం.. ఇవి చాలవన్నట్లు రెండేళ్ల క్రితం హార్ట ఆపరేషన్ చేయించుకుంది. ఆ మహా ఇల్లాలు ఇన్నింటితో బాధపడుతూ... రోజుకి పాతిక రకాల టాబ్లెట్స్ మింగుతుంది. అయినా తానేమై పోతుందోనేనిదిగులు... ప్రాణం పోతుందేమోనే భయం. ఆమెను కలవరపెడుతూంటాయ్.

సావిత్రమ్మ మంచం దిగదు. దిగి రెండు అడుగు వేస్తే పడిపోతానేమోననే భయం. పని మనిషి కోడలు ఇద్దరు చెరొక వేపు పట్టుకుని ఆమెకి స్నానం చేయిస్తే గానీ వప్పుకోదు.

సకల సపర్యలూ చేయించుకుంటూనే... తననెవరూ లక్ష్య పెట్టటం లేదని.. ప్రేమతో చూడటం లేదనీ గొడవ!

భార్య పోరు పడలేకనే మాధవరావు వీధిలో అరుగుకి అంకితమైనాడు. పగలల్లా అరుగు మీదే కాలాక్షేపం! కాఫీ... టిఫిను... భోజనం వేళకి మాత్రమే ఇంట్లోకెడతాడు.

వామనరావు పెళ్లాం లేనివంటరి పక్షి కావటం మూలాన... ఇద్దరికీ దోస్తి! అరుగు మీద చేరి బాతాఖానీ! ఇద్దరూ ఏకమై ఒకే న్యూస్ పేపర్ చదువుతారు. ఒకరు చదవటం.. మరొకరు వినటం... ఇదీ దిన చర్య!

వీధిన పోయే వారంతా వీరిద్దరినీ చూచి 'జంటకవుల్లావున్నారే'ని గేలిచేస్తుంటారు. నిజానికి వీడని జంట వారిద్దరిదీ!

'ఏమోయ్ మాధవరావ్!..ఈ న్యూస్ విను.. ఇకపై ప్రభుత్వోద్యోగాలు లేవట!..రావట!! మరీ చోద్యంగా వుంది కదూ ఈ స్టేట్‌మెంట్..' మోచేత్తో పక్కనే వున్న మాధవరావుని పొడిచి మరీ చెప్పాడు పేపర్లో దూర్చిన తల తిప్పకుండానే.

'అంటే... విద్యావంతులైన నిరుద్యోగుల గతేంటట?...పాపం అల్లాడి పోరటయ్యా..' సానుభూతి ప్రకటించాడు మాధవరావు.

'నీ దోమట్టిబుర్ర!... ఇకపై చదువుకున్న వారిపై గవర్నమెంటు 'టాక్స్' విధించవచ్చేమోని పేపర్‌వారి ఊహాగానాలు... అర్థమైందా?...ఈసారి తలపైకెత్తి మాధవరావు ముఖంలోకి చూస్తూ

వాస్తవాన్ని చమత్కరించాడు వామనరావు.

'ఇంకా నయం... వెహికిల్ టాక్స్... టోల్ టాక్స్... ఇన్‌కంటాక్స్... సేల్సుటాక్స్.... ప్రొఫెషనల్ టాక్స్ వంటివి పాతబడిపోయాయి కనుక... వాకింగ్ టాక్స్ టాకింగ్ టాక్స్.. రన్నింగ్ టాక్స్... బాడీ వెయిట్ టాక్స్.. అనేసి కొత్త కొత్త టాక్సల గురించి ప్రభుత్వం ఆలోచించి వాటిని అమలు పరచినా ఆశ్చర్యపోక్కర్లేదు. అలనాటి తుగ్లక్‌ని మించిన వాళ్లే మన వాళ్లు సుమా.. వెటకారంగా మాట్లాడిన మాధవరావు పక పకా నవ్వాడు.

'అదలావుండనీయ్!... మరి... ఈ చదువు కున్న నిరుద్యోగులందరూ ఏమైపోవాలనేది ప్రశ్న-వారిని దొంగలుగానో... రౌడీలుగానో.. గుండాలుగానో... తయారు కమ్మని పరోక్షంగా చెప్పటమేగా ఇది?- ఏమంటావ్?-కడుపుమండి మాట్లాడాడు వామనరావు.

'ఇప్పుడు మాత్రం యువత మడిగట్టుకు కూర్చున్నదా ఏంటి? - రోజూ పేపర్లో చూడటం లేదూ... కుర్రకారే ఛైన్ స్నాచింగు... టు వీలర్ దొంగిలించటం... ఇళ్లు దోచుకోవటం... బెదిరించి లాక్కోవటం... బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడటం రొటీన్నైంది. ఇదే ఇకపై తీవ్ర తరమౌతుందన్న మాట!...' పరిహాసంగా అన్నాడు మాధవరావు.

'ఆ మధ్య పేపర్లో చదివాన్లే రిటైరైన ఇద్దరు ఐ.పీ.యస్. అధికారులు మిలాఖత్ అయి ఏకంగా రాబరీ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పారట! సరికొత్త విధానాల్లో దొంగతనాలు ఎలా చేయాలో యువతకి తర్ఫీదు ఇస్తారంట!... నలభై రోజుల ట్రైనింగ్‌కి ఫీజు నాలుగువేలంటా ఓ ప్రకటన కూడా ఇచ్చారు...' గతాన్ని గుర్తు చేసుకుంటూ మాట్లాడేడు వామనరావు.

'అవునవును! కుర్రకారంతా ఆ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో చేరాలని ఎగబడ్డారట కూడాను!- అయినా దొంగతనాలు నేర్వటానికి సినీమాలు.. టి.వీ. సీరియల్స్ సరిపోవు గనుకనా..?- వ్యగ్యం పరిహాసం మిళితమైనయ్ మాధవరావు మాటల్లో...

మరోసారి కాఫీ తాగాలనే విషయం గుర్తుకొచ్చి వామనరావు కూర్చున్న వాడల్లా చెప్పా పెట్టకుండా ఇంట్లోకి తుర్రుమన్నాడు.

అరుగు మీద మాధవరావు వక్కడే అయినాడు. రెండవసారి కాఫీ తాగాలని జిహ్వ పీకుతున్నా నోరు తెరిచి కోడలిని అడిగితే... కాఫీ పొడిలేదనో... చక్కెర నిండుకుందనే సాకుతోనో నామం పెడుతుందే తప్ప అయ్యో పాపం ముసలాడు అడిగేడు.. ఇస్తే ఏం పోతుందనుకోదు.

కోడలిని ఏమి అన్లేని మాధవరావు... దిక్కుమాలిన కొంపలో రెండోసారి కాఫీక్కూడా గతిలేదు. అంటూ తన్లో తాను గొణుక్కోవటానికే అలవాటుపడ్డాడు. కోడలి మాటలు తనను అవమానించేవిగా అన్పించి.. తెగ రోషపడిపోతాడు.

తన బతుక్కి 'పెన్షన్'నైనా లేదని వాపోని క్షణం లేదు. చేతులో చిల్లరాడుతుంటే... రోజుకి

పది సార్లు బైటికెళ్లి ఎంచక్కా హోటల్లో స్ట్రాంగ్ కాఫీ తాగేయచ్చు!

కానీ... 'పెన్షన్'లేని వుద్యోగం చేసి చచ్చి రిటైరవటంతో వచ్చి పడింది చిక్కు! జేబులో చిల్లరకు కరువొచ్చేడ్సింది. పోనీ నోరు తెరిచి కొడుకుని అడుగుదామా అంటే... ఆకుంక ఎక్కడలేని విసుగూ ప్రదర్శిస్తాడు. వాడి పెళ్లాం నోరు తెరిచి అడిగిందే తడవు వంద నోట్లు ఠక్కున ఆమె చేతిలో పెట్టి ఇకిలిస్తాడు.

తాను పదిరూపాయల కోసం చేయి చాస్తే మాత్రం ఎక్కడలేని ఇబ్బందులూ ఏకరు పెడతాడు. మీదపడి కొట్టినట్టు మాట్లాడతాడు.

అసలు కొడుకులంతా ఇంతేనేమో?!- 'పెళ్లాం చెప్తే వినాలి'.. లాంటి సినిమాలు చూచి చెడిపోతున్నారు. భ్రష్టు పట్టి పోతున్నారు. దగుల్బాజీ వెధవ... నోరెత్తితే.. కోడలు కంచంలో ముద్దపెట్టదు... కొడుకేమో.. పెట్టెబేడా వీదిలోకి విసిరేస్తాడు.

అంచేతనే.... సగం చచ్చి.... మానాభిమానాలు లేకుండా... ముష్ఠి బతుకు బతకాల్సి వచ్చింది..అనేసి తనను తాను తిట్టు కున్నాడు మాధవరావు.

వామనరావు పరిస్థితి ఎంతోనయం. హాయిగా చేతికొచ్చే 'పెన్షన్' డబ్బుతో రోజులు జల్సాగా గడిపేస్తున్నాడు.

అతగాడిదంతా దర్జా వ్యవహారం!....

ఛ!...ఛఛ!...ఆరోజుల్లో దరిద్రపు గొట్టు గుమాస్తా వుద్యోగం గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్‌లో వచ్చి చావకపాయె?... ఇప్పుడీ కష్టాలు వుండేవికావు... అనేసి తన దురదృష్టానికి బావురు మన్నాడు మాధవరావు.

★★★★★

వామనరావు మాధవరావు ఇద్దరూ ఈవినింగ్ వాక్ చేస్తూ... రోడ్ క్రాస్ చేయటం కోసం ఒక చోట నిలబడ్డారు.

'ఏం ట్రాఫిక్ రా బాబూ? .. రోజురోజుకీ వాహనాల సంఖ్య.. దేశంలో దరిద్రం పెరిగినట్టు..శృతి మించి పోతోంది... వీటిని అదుపు చేయగల మొనగాడు కన్పించటంలేదు...' దిక్కులు చూస్తూ కామెంట్ చేసాడు మాధవరావు.

'వాటి మాట అట్లావుండనీయ్! దేశజనాభా ఏ లెక్కన పెరుగుతోందో...కళ్లతో చూస్తుంటే గుండె బేజారవుతోంది. ఇసుక వేస్తే రాలని పరిస్థితి!... 'విసుక్కున్నాడు వామనరావు.'

'అసలు నన్నడిగితే... ఏ అమెరికావాడో అణుబాంబులు వేస్తేగాని... జనసాంద్రతకి సొల్యూషన్ వుండదు. వెనకటికి హీరోషీమా... నాగసాకీలపై వేసినట్టు వేస్తేగానీ రోగం కుదరదు.

అప్పుడుగానీ.. చీమలపుట్టల్లా వున్న దేశ జనాభా కంట్రోలై...బతికి బైటపడే మిగతావారికి ప్రశాంతంగా వుండదు.' కడుపు మంటతో మాట్లాడేడు మాధవరావు.

అతగాడి మాటలు శాపంగా పరిణమిస్తే ఇంకేముంది? అంతా అల్లకల్లోలమే! దోవనపోతున్న వాళ్లెవరైనా మాధవరావు అనిన మాటలు వినివుంటే..చావగొట్టి చెవులు మూసే వారు. ముసలి ప్రాణం క్షణాల్లో 'హరి' అనేది.

'బాంబులూ యుద్ధాలూ దేనికోయ్?-దేశ జనాభాలో ముప్పైశాతం.. ఎందుకూ పనికి రాని మనలాంటి వారే!... వయోవృద్ధులందరినీ ఆ యమధర్మరాజు మూకుమ్మడిగా.. ఒకేసారి తీసుకెళ్లినా బావుండు. మిగతా వారైనా సుఖపడతారు' వేదన విసుగుధ్వనించినయ్ వామనరావు మాటల్లో.

రెడ్ సిగ్నల్ పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. జీబ్రాలైన్స్‌పై నడుస్తూ ఎలాగేతేనేం ఇద్దరూ రొడ్డుదాటారు.

ఇంతలో ఓ చిత్రమైన సంఘటన మాధవరావు కళ్ల పడింది.

వృద్ధుడొకాయన దారిన కన్పించిన వారినల్లా 'ఐయామ్ ఏన్ ఓల్డుమేన్!... ప్లీజ్ హెల్ప్‌మీ విత్ వన్ రూపీ..' అంటూ ఇంగ్లీషులో అడుక్కోవటం చూశాడు.

'వామనరావ్! అతగాడిపనే బావుంది. ఎంచక్కా ఇంగ్లీషులో మరీ అడుక్కుంటున్నాడు. విదేశీ భాషపై మోజుతో మనోళ్లంతా దానం చేస్తున్నారు. అదే తెలుగు ముష్టాళ్కి పావలా ఇవ్వాలన్నా మనసురాదు మనవారికి! నాకంటే అతడే నయం.. రోజుకో యాభైయ్యో... వందో... చిల్లర కళ్ల చూస్తాడు.. తాగాలన్పించినప్పుడల్లా 'చాయ్' తాగేసే ఫ్రీడమ్ వాడికుంది!...నేను రూపాయి బిళ్ల కళ్లచూసి నెలరోజులైంది..' అదోరకమైన బాధ ద్యోతకమైంది మాధవరావు మాటల్లో.

'ఛ' నోర్ముయ్. ఇంట్లో కూరలు...నెల సరుకులు కోడలు నీతోనేగా తెప్పించేది... అందులో నొక్కేస్తే సరి నీ అవసరాలు తీరతాయ్'...

'జోకులేసి నన్ను మరింత బాధించకు వామనరావ్. నా ఇంట్లో నేను దొంగతనానికి పాల్పడలేను. అది నాకిష్టముండదు..' నొచ్చుకున్నాడు మాధవరావు.

'ఏదో తమాషాకు అన్నాను. సీరియస్ అయిపోకు! "ఇందాక చూసిన ఇంగ్లీషు బెగ్గర్ బేగ్రౌండు తెల్సునా నీకు?- అతను చాలా ఏళ్లుగా ఈ వృత్తిలోనే వున్నాడు. ముష్టెత్తి సంపాదిస్తూ.. ఇల్లు కట్టాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లి చేసాడు.కొడుకుని కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివించి అమెరికా పంపాడు!..తెలుసానీకు?-చాలా గొప్పోడ్రా బాబూ వాడు..' తనకు తెలిసిన వాస్తవాన్ని చెప్పాడు వామనరావు.

ఆ మాటలు వింటూ మతిపోయినట్టన్పించింది మాధవరావుకి.

'అంతస్టేటస్సుండీ... ఇంకా బెగ్ చేస్తున్నాడేం?- అడిగేడు.

'కలిసొచ్చిన అదృష్టాన్ని కాదనుకోలేక... ఓపిక వున్నన్నాళ్లు ఇలాగే జీవయాత్ర కొనసాగిస్తానంటూ భీషణ ప్రతిజ్ఞ చేసివుంటాడేమో...?

'నేను అందుకూ పనికిరానూ! ఆత్మాభిమానం అడ్డొస్తుంది..'మాధవరావు గొంతు జీరవోయింది.

'చాల్లే నోర్ముయ్- పద.. మనిద్దరం కలిసి ఎదురుగానున్న ఉడిపీ హోటల్లో స్ట్రాంగ్ కాఫీ తాగుదాం!'' బిల్లు నేనే ఇస్తానే..' భుజం తట్టాడు వామనరావు.

హోటల్లో కూర్చుని ఇద్దరూ కాఫీ చప్పరిస్తున్నారు.

'చూడు మాధవా!'' కొందరు కొన్ని పనులే చేయగలరు. అందరూ... అన్ని పనులూ చేయలేరు... ఇదే జీవిత రహస్యం..' స్నేహితుడికి నీతి బోధించాడు.

ఆ మాటలు మాధవరావుని కుదిపేసినయ్.! చలించిపోయాడు పిచ్చిమాలోకం మాధవరావు.!!

-:(సమాప్తం):-